జీఎస్టీ వసూళ్లు అదుర్స్

గత నెలలో రూ.1.87 లక్షల కోట్లపైనే

న్యూఢిల్లీ, నవంబర్ 1: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు గత నెల అక్టోబర్‌లో పెద్ద ఎత్తున నమోదయ్యాయి. ఏకంగా రూ.1.87 లక్షల కోట్లకుపైగా వచ్చాయి. జీఎస్టీ మొదలైన దగ్గర్నుంచి ఇంతలా కలెక్షన్స్ ఉండటం ఇది రెండోసారే కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు వసూలైంది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే ఎక్కువగా ఉన్నాయి. శుక్రవారం విడుదలైన ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈసారి జీఎస్టీ వసూళ్లు రూ.1,87,346 కోట్లుగా ఉన్నాయి. నిరుడు అక్టోబర్‌లో రూ.1.72 లక్షల కోట్లే. 8.9 శాతం వృద్ధి కనిపించింది. ఈసారి సెంట్రల్ జీఎస్టీ కలెక్షన్ రూ.33,821 కోట్లుగా ఉంటే.. స్టేట్ జీఎస్టీ రూ.41,864 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.99,111 కోట్లుగా ఉన్నాయి. సెస్సు రూ.12,550 కోట్లుగా ఉన్నట్టు ప్రభుత్వం తెలిపింది. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ 10.6 శాతం పెరిగి రూ.1.42 లక్షల కోట్లకు చేరింది. దిగుమతులపై విధించిన పన్ను ద్వారా రూ.45,096 కోట్లు సమకూరింది. గతంతో చూస్తే దాదాపు 4 శాతం పెరిగింది. పండుగల దృష్ట్యా మార్కెట్‌లో పెరిగిన కార్యకలాపాలు, అమ్మకాలు జీఎస్టీ వసూళ్లకు కలిసొచ్చాయి.

పడిపోతున్న ఫారెక్స్ నిల్వలు

నెల రోజుల్లో 20 బిలియన్ డాలర్లు ఔట్

న్యూఢిల్లీ, నవంబర్ 1: దేశంలోని ఫారెక్స్ రిజర్వులు అంతకంతకూ కరిగిపోతున్నాయి. అక్టోబర్ 25తో ముగిసిన వారంలోనూ మరో 3.4 బిలియన్ డాలర్లు హరించుకుపోయాయి. దీంతో దాదాపు గత నెల రోజుల్లో చోటుచేసుకున్న వరుస పతనాల్లో విదేశీ మారకపు నిల్వలు ఏకంగా 20 బిలియన్ డాలర్లకుపైగా పడిపోయినట్టైంది. సెప్టెంబర్ 27న 704.9 బిలియన్ డాలర్లుగా ఉంటే, గత నెల 25 నాటికి 684.8 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ మేరకు శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలియజేసింది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 25దాకా ప్రతీ వారం 3.7, 10.7, 2.2, 3.4 బిలియన్ డాలర్ల చొప్పున క్షీణించాయి. ఇక భారతీయ ఫారెక్స్ నిల్వల్లో అత్యధిక శాతం ఫారిన్ కరెన్సీ అసెట్స్ ఇవి గత నెల 25 నాటికి 593.75 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వారం రోజుల్లో 4.48 బిలియన్ డాలర్లు తగ్గిపోవడం గమనార్హం. అలాగే బంగారం నిల్వలు 1 బిలియన్ డాలర్ల మేర పెరిగి 68.5 బిలియన్ డాలర్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్‌లు) 18.2 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఆర్బీఐ వెల్లడించింది. మరోవైపు ఫారెక్స్ రిజర్వుల్లో భారత్ ప్రపంచంలోనే నాల్గో స్థానంలో ఉన్నది. చైనా, జపాన్, స్విట్జర్లాండ్ తర్వాత దేశంలోని విదేశీ మారకపు నిల్వలే ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

క్యూ2లో షీలా ఫోమ్ లాభం భేష్

నోయిడా, నవంబర్ 1: దేశీయ మార్కెట్‌లో స్లీప్‌వెల్, కర్లాన్ తదితర ప్రముఖ బ్రాండ్లతో పరుపుల్ని విక్రయిస్తున్న షీలా ఫోమ్ లిమిటెడ్ లాభాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికం (జులై–సెప్టెంబర్)లో రూ.43 కోట్ల నికర లాభాన్ని సంస్థ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023–24) ఇదే త్రైమాసికంతో పోల్చితే సుమారు 12 శాతం పెరిగింది. స్టాండలోన్ రెవిన్యూ రూ.602 కోట్లుగా ఉన్నది. మునుపటితో చూస్తే దాదాపు 42 శాతం ఎగబాకడం గమనార్హం. అలాగే ఏకీకృత ఆదాయం రూ.813 కోట్లుగా నమోదైంది. గతంతో చూస్తే సుమారు 32 శాతం ఎగిసింది. కాగా, ఈసారి స్లీప్‌వెల్ ఉత్పత్తులకు డిమాండ్ 40 శాతం, కర్లాన్ గిరాకీ 26 శాతం పెరిగినట్టు కంపెనీ వెల్లడించింది. ఆటోమోటివ్, ఫుట్‌వేర్ తదితర మార్కెట్ల నుంచి కూడా డిమాండ్ పెరిగిందని ఈ సందర్భంగా షీలా ఫోమ్ వివరించింది.

ముహూర్తం అదిరింది

ప్రత్యేక ట్రేడింగ్‌లో పరుగులు పెట్టిన సూచీలు • సంవత్ 2081కు లాభాలతో స్టాక్ మార్కెట్లు ఆహ్వానం

సెన్సెక్స్ 335, నిఫ్టీ 99 పాయింట్లు వృద్ధి • మెరిసిన బ్యాంకింగ్, ఆటో, చమురు-గ్యాస్ షేర్లు

బీఎస్‌ఈ వద్ద మూరత్ ట్రేడింగ్‌లో గంట మోగిస్తున్న బెయిన్ క్యాపిటల్ ఇండియా ఎండీ అమిత్ చంద్ర, బీఎస్‌ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి

దీపావళి పండుగను పురస్కరించుకొని జరిగిన ప్రత్యేక ట్రేడింగ్‌లో బీఎస్‌ఈ ఆడిటోరియంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా ట్రేడింగ్ చేస్తున్న స్టాక్ ట్రేడర్లు

ముంబై, నవంబర్ 1: దేశీయ స్టాక్ మార్కెట్లలో మరో కొత్త సంవత్సరం మొదలైంది. దీపావళి పండుగను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ)ల్లో నిర్వహించిన మూరత్ ట్రేడింగ్.. సంవత్ 2081కు ఆరంభం పలికింది. ట్రేడర్లు తమ కొత్త ఖాతా పుస్తకాలను తెరవడాన్ని సూచికగా ఈ ప్రత్యేక ట్రేడింగ్‌ను ఏటా జరుపుతారు. ఇక 6 గంటల నుంచి 7 గంటల వరకు గంటపాటు జరిగిన ఈ ట్రేడింగ్‌లో మొదట్లో కనిపించిన ఉత్సాహం చివరిదాకా లేకున్నా.. సూచీలు ఆకర్షణీయ లాభాలనే సొంతం చేసుకున్నాయి. బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 335.06 పాయింట్లు లేదా 0.42 శాతం ఎగిసి 79,724.12 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 635 పాయింట్లు ఎగబాకడం గమనార్హం. సెన్సెక్స్ గరిష్ఠ స్థాయి 80,023.75 అవగా, కనిష్ఠం 79,655.55 పాయింట్లు. అలాగే ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 99 పాయింట్లు లేదా 0.41 శాతం పుంజుకొని 24,304.35 వద్ద నిలిచింది.

ఆకట్టుకున్న బ్యాంకింగ్, ఆటో షేర్లు

బ్యాంకింగ్, ఆటో, చమురు–గ్యాస్ రంగాల షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలోనే మహీంద్రా అండ్ మహీంద్రా షేర్ విలువ అత్యధికంగా 3.29 శాతం పెరిగింది. అక్టోబర్‌లో పెద్ద ఎత్తున జరిగిన వాహన విక్రయాలు సంస్థకు ఇలా కలిసొచ్చింది. ఇక అదానీ పోర్ట్స్ 1.26 శాతం, టాటా మోటర్స్ 1.14 శాతం, యాక్సిస్ బ్యాంక్ 0.92 శాతం చొప్పున లాభపడ్డాయి. నెస్లే, ఎన్టీపీసీ, రిలయన్స్, ఐటీసీ, టైటాన్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లూ పెరిగాయి. అయితే హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ 0.69 శాతం, స్మాల్‌క్యాప్ 1.16 శాతం చొప్పున పెరిగాయి. రంగాలవారీగా ఆటో 1.15 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1.10 శాతం, చమురు–గ్యాస్ 0.91 శాతం మేర లాభపడ్డాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ ఫలితాలు నమోదయ్యాయి. జపాన్, చైనా, దక్షిణ కొరియా సూచీలు నష్టపోగా, హాంకాంగ్ సూచీ మాత్రం లాభపడింది. ఐరోపాలోని ప్రధాన స్టాక్ మార్కెట్లూ లాభాల్లోనే కదలాడుతున్నాయి. గురువారం విదేశీ సంస్థాగత మదుపరులు రూ.5,813.30 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారని స్టాక్ ఎక్స్ఛేంజ్ వర్గాలు తెలిపాయి. నాడు సెన్సెక్స్ 553.12 పాయింట్లు, నిఫ్టీ 135.50 పాయింట్లు పడిపోయాయి. గత నెల అక్టోబర్ మొత్తంగా సెన్సెక్స్ 4,910.72 పాయింట్లు లేదా 5.82 శాతం, నిఫ్టీ 1,605.5 పాయింట్లు లేదా 6.22 శాతం దిగజారాయి.

సంవత్ 2080 భళా

గురువారంతో ముగిసిన సంవత్ 2080.. దేశీయ స్టాక్ మార్కెట్ మదుపరులకు ఆకర్షణీయ లాభాలనే పంచింది. ఈ ఏడాది కాలంలో సెన్సెక్స్ 14,484.38 పాయింట్లు లేదా 22.31 శాతం పుంజుకున్నది. ఈ క్రమంలోనే బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ కూడా రూ.124.42 లక్షల కోట్లు ఎగిసింది. ప్రస్తుతం బీఎస్‌ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4,44,71,429.92 కోట్లు (5.29 ట్రిలియన్ డాలర్లు)గా ఉన్నది. ఇక నిఫ్టీ గత ఏడాది కాలంలో 4,780 పాయింట్లు లేదా 24.60 శాతం ఎగబాకింది. బీఎస్‌ఈ 70వేలు, 80వేల మార్కులను అధిరోహించింది ఈ ఏడాదిలోనే. ఎన్‌ఎస్‌ఈ 20వేల మార్కును దాటింది కూడా ఈ సంవత్సరమే. మొత్తానికి తీవ్ర ఒడిదొడుకులు ఎదురైనా.. ఇన్వెస్టర్లకు మాత్రం కాసుల వర్షాన్నే కురిపించాయి ఈక్విటీ మార్కెట్లు. అయితే విదేశీ సంస్థాగత మదుపరులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం కొంత ఇబ్బందికరంగా మారింది. అయినప్పటికీ ఆ లోటును దేశీయ సంస్థాగత మదుపరులు భర్తీ చేయడం కలిసొచ్చింది.

యాపిల్‌కు యమా క్రేజ్

క్యూ2లో దేశీయంగా ఆల్‌టైమ్ హైకి కంపెనీ రెవిన్యూ

న్యూఢిల్లీ, నవంబర్ 1: ఐఫోన్, ఐప్యాడ్ ఉత్పత్తుల తయారీ సంస్థ యాపిల్‌కు భారతీయ మార్కెట్‌లోనూ కష్టమర్లు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ క్రమంలోనే మునుపెన్నడూ లేనివిధంగా భారీగా ఆదాయం నమోదైంది. ఈ జూలై–సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ2)లో రికార్డు స్థాయిలో 69.95 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఐఫోన్ సేల్స్ వాటా 43.8 బిలియన్ డాలర్లు. సర్వీసెస్ సేల్స్ దాదాపు 12 శాతం పుంజుకొని 24.97 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐప్యాడ్ సేల్స్ 8 శాతం ఎగిసి 6.95 బిలియన్ డాలర్లను తాకినట్టు శుక్రవారం సంస్థ వర్గాలు తెలిపాయి.

ఆటో అమ్మకాలు అంతంతే

దేశీయ మార్కెట్‌కు పెద్దగా కలిసిరాని పండుగ సీజన్

అక్టోబర్‌లో ఆకట్టుకోని వాహన విక్రయాలు

న్యూఢిల్లీ, నవంబర్ 1: ఆటో రంగ సంస్థలకు ఈసారి పండుగ సీజన్ పెద్దగా కలిసిరాలేదు. దేశీయ మార్కెట్‌లో అమ్మకాలు అంతంతమాత్రంగానే సాగాయి మరి. మార్కెట్ లీడర్ మారుతీ సుజుకీ నిరుడు అక్టోబర్‌తో పోల్చితే ఈ ఏడాది అక్టోబర్‌లో దాదాపు 10వేల యూనిట్ల మేర తక్కువగా విక్రయాలను చేయగలిగింది. చిన్న కార్లలో పాపులర్ మాడళ్లైన ఆల్టో, ఎస్–ప్రెస్సోకు ఆదరణ కరువవడం, కాంపాక్ట్ కార్లైన బాలెనో, సెలేరియో, డిజైర్, స్విఫ్ట్, వాగనార్ తదితర మాడళ్లకూ గిరాకీ తగ్గడం దెబ్బతీసింది. అయితే ఎగుమతులు భారీగా జరిగాయని సంస్థ ప్రకటించింది. ఎగుమతులను కూడా కలుపుకొంటే మునుపెన్నడూ లేనివిధంగా గత నెల 2,06,434 యూనిట్ల సేల్స్ నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలతో చూస్తే 4 శాతం ఎక్కువ. ఇక హ్యుందాయ్ ఫర్వాలేదనిపించినా.. టాటా మోటర్స్, హోండా కార్స్ అమ్మకాలు నిరాశపర్చాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా, ఎంజీ మోటర్ వాహన అమ్మకాలు మాత్రం అదరగొట్టాయి. ద్విచక్ర వాహన విభాగంలో హీరో మోటోకార్ప్ విక్రయాలు 18 శాతం ఎగబాకాయి. అలాగే రాయల్ ఎన్‌ఫీల్డ్ 26 శాతం వృద్ధిని కనబర్చింది. టీవీఎస్ సైతం ఆకట్టుకున్నది.

ఓలా ఎలక్ట్రిక్‌కు గిరాకీ

గత నెలలో 41,605 వాహనాలను అమ్మినట్టు విద్యుత్తు ఆధారిత ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ తెలియజేసింది. గతంతో పోల్చితే విక్రయాలు 74 శాతం పెరిగాయని పేర్కొన్నది. ప్రధానంగా ద్వితీయ, తృతీయ శ్రేణి మార్కెట్లలో గిరాకీ పెరిగినట్టు సంస్థ చెప్పింది.

అక్టోబర్‌లో దేశీయంగా వాహన విక్రయాలు (యూనిట్లలో)

సంస్థ	2024	2023
మారుతీ సుజుకీ	1,59,591	1,68,047
హ్యుందాయ్	55,568	55,128
మహీంద్రా	54,504	43,708
టాటా మోటర్స్	48,131	48,337
టయోటా	28,138	20,542
హోండా కార్స్	10,080	13,083
ఎంజీ మోటర్	7,045	-
హీరో మోటోకార్ప్	6,79,091	5,74,930
రాయల్ ఎన్‌ఫీల్డ్	1,01,886	-
టీవీఎస్	3,90,489	3,44,957

27 నుంచి అర్ధవార్షిక పరీక్షలు

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): అఖిల భారత సర్వీసు, స్టేట్ సర్వీస్‌లోని ఉన్నతాధికారులకు నిర్వహించే అర్ధవార్షిక, భాషాపరీక్షలను ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ తెలిపింది.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X@SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.
PUB/1100
టి.ఎన్.నం.97/2024 తేది: 01-11-2024
స్టోర్స్ ఐటమ్‌ల సరఫరా
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
దిగువ టెండర్లు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయబడినవి. టెండరుదార్లు వెబ్‌సైట్ **www.ireps.gov.in**ను దర్శించి, వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయాల్సిందిగా కోరబడుతున్నారు. టెండరు వివరణ, పరిమాణం, బయానా, SDను వెబ్‌సైట్‌లో చూడవచ్చును. మాన్యువల్‌గా దాఖలు చేసిన ఆఫర్లు అంగీకరించబడవని గమనించగలరు. పోస్టు ద్వారా పంపిన ఆఫర్లు పరిశీలించబడవు. **టెండరు ముగింపు సమయం టెండరు గడువు తేదీన 14.30 గం.లు.** ''అన్ని దేశీయ ఆఫర్ల కొరకు EMD, **www.ireps.gov.in**లో లభించే విధంగా వయా ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే అంగీకరించబడతాయి.

టెండర్ నం.	సంక్షిప్త వివరణ
54241139A	బూమ్ అసెంబ్లీ
30241193	బోగి బోల్‌స్టర్ కొరకు హ్యాంగర్
66247124	పిసిబిలు రిలేలు సేకరణ మొదలైనవి
66247478	టెన్షన్ రైల్స్ మొదలైనవి సేకరణ
66246663	పిఎసి ఐటంలుకు ప్లాసర్ సేకరణ
66247580	షాఫ్ట్ మ్యానిఫోల్డ్‌కు ఇన్‌పుట్ సేకరణ
66246746	హైడ్రాలిక్ పంపు సేకరణ
66247253	సిలిండర్ ప్రైజర్ సేకరణ

గమనిక: టెండరు తెరచు గడువు తేదీలు 19-11-2024న క్ర.సం.01, 20-11-2024న క్ర.సం.02, 25-11-2024న క్ర.సం.03 నుండి 06, 26-11-2024న క్ర.సం.07&08.
పైన తెలిపిన టెండర్లతోపాటు రూ. **50 లక్షల** కంటే ఎక్కువ విలువ గల ఇతర టెండర్లు కూడా ఉన్నాయి. వివరాల కొరకు పై రైల్వే వెబ్‌సైట్ దర్శించగలరు.
ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్, సికింద్రాబాద్

టెండర్ నోటీస్
PUB/1101
దిగువ టెండర్లు ముగింపు **తేది: 26-11-2024న 15.00** గంటలకు సంబంధించి భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న **సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/మెయింటెనెన్స్/హైదరాబాద్** వారు ఇ-టెండర్లు కోరుతున్నారు. బిడ్డర్లు తమ ఒరిజినల్/ రివైజ్డ్ బిడ్లను ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే దాఖలు చేయగలుగుతారు. ఈ టెండరుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏదేని అటువంటి మాన్యువల్ ఆఫర్ స్వీకరించినప్పటికీ తిరస్కరించబడుతుంది.
క్ర.సం. 1.టెండర్ నెం.31-Cong-24-25-Sr.DEE-M-HYB: **పని వివరణ:** హైదరాబాద్ డివిజన్:PCSTEs కార్యాలయం, 7వ అంతస్తు రైల్ నిలయం వద్ద PCSTE చాంబర్, ఆఫీసర్స్ చాంబర్ (5 నెం.లు) మరియు S&T కంట్రోల్ ఆఫీస్ నవీకరణ–విద్యుత్ ఏర్పాట్లు. **సుమారు వ్యయం:** రూ.50,86,007/-, **బయానా:** రూ.1,01,700/-, **పూర్తిచేయు కాలం:** 6 నెలలు, **ముగింపు తేది:** 26-11-2024
వెబ్‌సైట్ వివరాలు: **www.ireps.gov.in**
టెండరు పూర్తి వివరాలు చూసేందుకు నోటీసు బోర్డ్ ప్రదేశం: సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/మెయింటెనెన్స్/హైదరాబాద్, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్-500071 వారి కార్యాలయం.
సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, హైదరాబాద్
A1405
తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి

బీఈడీ చదవడమే పాపమా..?

- **అభ్యర్థులెక్కువ.. పోస్టులు తక్కువ**
- **ఎస్‌ఏ పోస్టుల్లో 30శాతం నేరుగా భర్తీ**
- **పదోన్నతుల ద్వారా 70శాతం భర్తీ**
- **శాపంగా మారిన జీవో-108**
- **రేపు చలో ఇందిరాపార్క్‌కు పిలుపు**

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఇది వరకు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) చదివితే టీచర్ ఉద్యోగం పక్కా.. కానిప్పుడు నిరుద్యోగం పక్కా అన్నట్టుగా పరిస్థితులున్నాయి. బీఈడీ చదవడమే అభ్యర్థుల పాలిట శాపంగా మారింది. టీచర్లకు పదోన్నతులు కల్పించే నిబంధనలు వారికి అడ్డుగా నిలుస్తున్నాయి. గతంలోఎస్జీటీ పోస్టులకు పోటీపడే అవకాశముండటంతో అభ్యర్థులు పెద్ద మొత్తంలో బీఈడీ కోర్సుల్లో చేరారు. కానీ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఎస్జీటీ పోస్టులను డీఎడ్ వారితోనే భర్తీచేస్తున్నారు. దీంతో 5లక్షలకు పైగా బీఈడీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుండగా..వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. న్యాయం చేయాలని కోరుతూ అభ్యర్థులు 3న చలో ఇందిరాపార్క్‌కు పిలుపునిచ్చారు. స్పందించకుంటే ఆమరణదీక్షకు దిగుతామన్నారు.

ఎలాగంటే..

- బీఈడీ అభ్యర్థులకు గతంలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులకు పోటీపడే అవకాశముండేది. కానిప్పుడు ఎస్జీటీ పోస్టులను కేవలం డీఎడ్ వారితోనే భర్తీచేస్తున్నారు.
- బీఈడీ అభ్యర్థులు కేవలం స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పోస్టులకు మాత్రమే పోటీపడే అవకాశముంది. వీటిలో 70శాతం పోస్టులను పదోన్నతుల ద్వారా నింపుతుండగా, కేవలం 30శాతం పోస్టులనే నేరుగా రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీచేస్తున్నారు. దీంతో ఎస్‌ఏ పోస్టుల సంఖ్య చాలా పరిమితంగా ఉంటుంది. డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తే ఏ జిల్లాలో తీసుకున్నా క్యాటగిరీవారీగా ఎస్‌ఏ పోస్టులు 1, 2, 3కు మించడంలేదు. కొన్ని జిల్లాల్లో పలు క్యాటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులే ఉండటంలేదు.

ప్రమోషన్ నిష్పత్తిని మార్చాలి

ఎస్జీటీ పోస్టులను 100శాతం డీఎడ్ వారితో భర్తీచేసినట్టే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను వందశాతం బీఎడ్ అభ్యర్థులతోనే నింపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. లేదా 20శాతం పోస్టులను పదోన్నతుల ద్వారా నింపి, 80 శాతం పోస్టులను రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీచేయాలని కోరుతున్నారు. డీఎస్సీ–2024లో కేవలం 2,629 ఎస్‌ఏ పోస్టులను సోషల్‌కు 42వేలు, జీవశాస్త్రం 34వేలు, గణితంకు 28వేల చొప్పున అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్క పోస్టుకు వేలాది మంది పోటీపడుతున్నారు. దీంతో టీచర్ల పదోన్నతుల నిష్పత్తిని మార్చాలని బీఈడీ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

అన్యాయాన్ని సవరించాలి

పదోన్నతుల్లో అనుసరిస్తున్న నిష్పత్తితో బీఈడీ అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతున్నది. ఒక్క పోస్టుకు వేలాది మంది పోటీ పడుతున్నారు. కొన్ని జిల్లాల్లో పోస్టుల్లేక వదులుకోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం చొరవ తీసుకుని పదోన్నతుల విధానాన్ని సవరించి వందశాతం ఎస్‌ఏ పోస్టులను బీఈడీ వారితోనే భర్తీచేయాలి. ఇలా చేస్తేనే 5లక్షల మంది బీఈడీ అభ్యర్థులకు న్యాయం జరుగుతున్నది. పాఠశాల విద్యను బోర్డ్ ఆఫ్ ప్రైమరీ ఎడ్యుకేషన్, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌గా విభజించాలి.

- భూక్య కుమార్, బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఎట్టకేలకు మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపు

- **రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వులు జారీ**
- **ఇతర సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్**

హైదరాబాద్, నవంబర్1 (నమస్తే తెలంగాణ): విద్యార్థి, ప్రజా, ఉపాధ్యాయ సంఘాలు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ ఒత్తిడితో ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు సంబంధించిన మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచుతూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గురుకులాలు, హాస్టళ్లలో దాదాపు 8లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి సంబంధించిన మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపు అనేది మూడేళ్లకు ఒకసారిగా మార్కెట్ ధరలకు అనుగుణంగా సవరించడం పరిపాటి. తెలంగాణలో 2017లో రేట్లను సవరించారు. ఆ తరువాత 2023లో బీఆర్‌ఎస్ హయాంలో మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు 25శాతం మేరకు రేట్లను పెంచాలని నిర్ణయించారు. ఉత్తర్వులు వెలువడేలోగానే ఎన్నికలు రావడంతో అది వాయిదా పడింది. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా చార్జీల పెంపుపై శీతకన్నువేసింది. చార్జీలను పెంచకపోవడంతో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు శ్రీకారం చుట్టాయి. అనేక చోట్ల హాస్టళ్లలో ఆహారకల్తీ సంఘటనలు జరిగి వందలాది మంది విద్యార్థులు దవాఖానల పాలయ్యారు. దీనిపై ప్రజాసంఘాలు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడంతోపాటు, ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. దీంతో కాలేజీ హాస్టళ్ల విద్యార్థుల మెస్ చార్జీలను రూ.1500 నుంచి రూ.2100, గురుకుల హాస్టళ్లలో 3–7వ తరగతి విద్యార్థుల మెస్‌చార్జీలను రూ.900 నుంచి రూ.1330, 8–10వ తరగతి విద్యార్థులకు రూ. 1100 నుంచి రూ.1540కు పెంచింది. అదే విధంగా 3–7వ తరగతి బాలురకు చెల్లిస్తున్న కాస్మెటిక్ చార్జీలను 55నుంచి రూ.150, బాలికలకు రూ.175, 8–10వ తరగతి బాలురకు సంబంధించి రూ.62 నుంచి 200, బాలికలకు 75నుంచి 275కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సమస్యలనూ పరిష్కరించాలని వినతి

హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపును ప్రజా, కుల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు స్వాగతించాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, టిగారియా నేతలు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్, తెలంగాణ గురుకుల విద్యా జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ బాలరాజు, కే యాదయ్య, పీ రుషికేశ్ కుమార్, ఎం వెంకటేశ్వర్లు, కేవీ చలపతి, డీ బాలస్వామి, అవుల సైదులు, ఎస్ ఝాన్సీ రాణి, డాక్టర్ టీ సాంబలక్ష్మి, జానీమియా, శ్రీనివాస్ వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు.

క్రిష్ణంపల్లి శివారులోని ముళ్ల పొదల్లో లభ్యమైన ఆడ శిశువు

ముళ్లపొదల్లో శిశువు

శరీరమంతా పట్టిన చీమలు శిశువిహార్‌కు తరలింపు

అమరచింత, నవంబర్ 1 : మానవత్వం మంటకలిసింది.. అప్పుడే పుట్టిన ఆడశిశువును కర్కశంగా ముళ్లపొదల్లో వదిలేసిన హృదయ విదారక ఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకున్నది. అమరచింత మండలం క్రిష్ణంపల్లి గ్రామ శివారులోని ముళ్ల పొదల్లో గురువారం రాత్రి 10 గంటల తర్వాత అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. అర్ధరాత్రి తర్వాత చంద్రఘడ్ స్టేజీ శివారులో గొర్రెల మందను నిలిపి ఇంటికి వెళ్తున్న గొర్రెల కాపరులకు శిశువు ఏడుపు వినిపించినా కుక్క పిల్ల అరుపు అనుకొని అక్కడి నుంచి వెళ్లారు. శుక్రవారం ఉదయం వరకు రోదిస్తుండటంతో అటుగా వెళ్తున్న వారు గుర్తించి స్థానికులకు సమాచారం అందించడంతో శిశువును అక్కున చేర్చుకున్నారు. శరీరమంతా చీమలు పట్టి కందిపోయింది. స్థానికులు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మదకు సమాచారం అందించారు. ఆత్మకూరు ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షల అనంతరం జిల్లా కేంద్రంలోని శిశు విహార్‌కు తరలించారు.

డాక్టర్ శోభారాణికి ఐఎంఏ రాష్ట్రస్థాయి అవార్డు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): వైద్య వృత్తిలో అత్యున్నత సేవలందిస్తున్న డాక్టర్ శోభారాణికి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఆమె స్థానిక సిరి దవాఖానలో వైద్యురాలిగా పనిచేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు వైద్య సేవలతోపాటు సర్కారు బడి విద్యార్థులకు చేయూతనందిస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన తెలంగాణ ఐఎంఏ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేసి, గురువారం హైదరాబాద్‌లో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలీ, భారత అమెరికా వైద్యుల సంఘం అధ్యక్షుడు కత్తుల సతీశ్, రాష్ట్ర అధ్యక్షుడు కాశీప్రసాద్, ద్వారక ప్రసాద్ తదితరులు శోభారాణికి అవార్డు ప్రదానం చేశారు.



డాక్టర్ శోభారాణికి అవార్డు అందజేస్తున్న ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలీప్ భానుశాలీ

సేమ్ మార్కులొస్తే 'సబ్జెక్ట్' ర్యాంక్

- **జేఈఈ టై బ్రేకర్ నిబంధనల్లో మార్పు**
- **వెబ్‌సైట్ పేరును మార్చిన ఎన్టీఏ**

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్స్‌లో సేమ్ మార్కులు(ఒకే మార్కులు) సాధించిన విద్యార్థులకు సబ్జెక్టులవారీగా ర్యాంకులు కేటాయించేలా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) మార్పులు చేసింది. తొలుత గణితంలో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. ఆ తర్వాత ఫిజిక్స్, ఆ తర్వాత కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో విద్యార్థులకొచ్చిన మార్కులను లెక్కలోకి తీసుకుంటారు. ఆ తర్వాత తక్కువగా తప్పు సమాధానాలు, ఎక్కువగా సరైన సమాధానాలు రాసినవారీగా ర్యాంకులు కేటాయిస్తారు. ఆ తర్వాత గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో తక్కువ తప్పు సమాధానాలిచ్చి, ఎక్కువగా సరైన సమాధానాలు రాసినవారిని పరిగణనలోకి తీసుకుంటారు. ఇది వరకు అభ్యర్థుల వయస్సును పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను కేటాయించేది. మొత్తం 300 మార్కులకు ఏడాదికి రెండు సార్లు జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తుండగా, దేశవ్యాప్తంగా 8లక్షలకుపైగా విద్యార్థులు హాజరవుతున్నారు. జాతీయంగా ఒకే పరీక్ష కావడంతో పలువురు విద్యార్థులు ఒకే మార్కులను సాధిస్తున్నారు. ఇలాంటి వారు వేలల్లో ఉంటున్నారు. వీరికి ర్యాంకులను కేటాయించడంలో ఇది వరకు ఎన్టీఏ మొదట వయస్సును లెక్కలోకి తీసుకుని, సీనియర్‌కు ఎక్కువ ర్యాంకు.. జూనియర్‌కు తక్కువ ర్యాంకును కేటాయించేది. కానిప్పుడు ఈ విధానాన్ని ఎన్టీఏ తొలగించింది. సబ్జెక్టులవారీగా ర్యాంకులు కేటాయించాలని నిర్ణయించింది. ఇదిలా ఉండగా జేఈఈ మెయిన్స్ వెబ్‌సైట్ పేరును సైతం ఎన్టీఏ మార్చింది. తాజాగా jeemain.nta.ac.in పేరుతో కొత్త వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొచ్చింది.

ముగింపు దశకు జేఎల్ పోస్టుల భర్తీ

- **కేసీఆర్ హయాంలోనే నోటిఫికేషన్, పరీక్షలు**
- **1300కు పైగా జేఎల్‌లకు ఈనెల 8న నియామకపత్రాలు**

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టుల భర్తీ ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్నది. 8న సీఎం రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 1,392 లెక్చరర్ పోస్టుల భర్తీకి 2022లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కేసీఆర్ హయాంలోనే సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో రాత పరీక్షలను సైతం నిర్వహించారు. ఇటీవలే ఫలితాలను విడుదల చేసి, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశారు. తాజాగా తుది ఫలితాలు ప్రకటించి, ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలు అందజేయాల్సి ఉంది. కాగా లెక్చరర్ పోస్టుల భర్తీకి గతంలో ఇంటర్వ్యూలు నిర్వహించేవారు. ఇది పూర్తిగా పక్షపాత ధోరణికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దీంతో కేసీఆర్ సర్కారు వివక్షకు, పక్షపాతానికి అవకాశం లేకుండా పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని ఇంటర్వ్యూలను రద్దు చేసింది. దీంతో తాజాగా నియామకమయ్యే లెక్చరర్లు ఇంటర్వ్యూలేకుండా ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు దక్కించుకోనున్నారు.

ఇక ఈజీగా లైఫ్ సర్టిఫికెట్ దాఖలు

- **డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిన రైల్వే**
- **సీనియర్ పెన్షన్‌దారులకు ఎంతో ప్రయోజనం: ఎస్‌సీఆర్**

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): రైల్వేలలో పెన్షన్‌దారులకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడంపై ఆ శాఖ దృష్టి పెట్టింది. ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో కొత్తగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. పెన్షన్‌దారులు తమ పెన్షన్‌ను కొనసాగించడానికి ప్రతి ఏడాది నవంబర్‌లో లైఫ్ సర్టిఫికెట్లను రైల్వే పెన్షనర్ల సంక్షేమ శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. కొత్తగా తెచ్చిన డిజిటల్ విధానంలో అలా ఉండదు. ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా అప్‌డేట్ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇక నుంచి ఆ సర్టిఫికెట్ల దాఖలు చేయడాన్ని సులభతరం చేస్తూ 'డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ 3.0' ప్రారంభించినట్టు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. ఈ విధానం వల్ల మరీ ముఖ్యంగా సీనియర్ పెన్షన్‌దారులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

డెంగ్యూతో బాలుడి మృతి

శివవర్ధన్ (ఫైల్)

ఉప్పునుంతల, నవంబర్ 1 : డెంగ్యూతో ఐదేండ్ల బాలుడు మరణించాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. చిన్నారి తల్లిదండ్రుల కథనం మేరకు.. ఉప్పునుంతల మండలం మర్రిపల్లికి చెందిన రెడ్డమోని మల్లేశ్, హైమావతి దంపతుల కుమారుడు శివవర్ధన్ యాదవ్(5)కు వారం కిందట జ్వరం వచ్చింది. చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు అచ్చంపేటలోని కిడ్స్ కేర్ ప్రైవేటు దవాఖానకు తరలించగా.. అక్కడి వైద్యులు పరీక్షించి డెంగ్యూ సోకిందని, హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. బాలుడిని హైదరాబాద్‌కు తరలించగా.. పరిస్థితి విషమంగా ఉన్నదని, తాము ఏమీ చేయలేమని చేతులెత్తేశారు. వైద్యం అందకపోవడంతో బాలుడు గురువారం రాత్రి మృతి చెందాడు. సకాలంలో వైద్యం అందకే తమ కుమారుడు మృతి చెందినట్టు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు.